ఇలా అయితే ఎలా?



బ్యాంకు కాలనీ-కుమ్మరిపాలెం రహదారి పక్కన కొబ్బరి బొండాలు

- ఎక్కడ పడితే అక్కడే ఖాళీ కొబ్బరి బొండాలు
- ప్రబలుతున్న వ్యాధులు.. పట్టించుకోని అధికారులు



వెంకటేశ్వరమెట్ట జాతీయ రహదారి వంతెన వద్ద ఖాళీ కొబ్బరి బొండాల డంప్

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ప్రజలు ప్రస్తుతం దోమకాట్లతో డెంగీ, మలేరియా జ్వరాల బారిన పడి ఇబ్బందుల పాలవుతున్నారు. దోమల నివారణకు జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది కేవలం ఫాగింగ్ మాత్రమే చేసి చేతులు దులుపుకోవడం వలన ఫలితం కనిపించడం లేదు. చలికి దుప్పట్లు కప్పుకున్నా ఫ్యాన్ తిరిగితే తప్ప దోమలు వదిలిపెట్టడం లేదు. దోమలను పూర్తిగా నివారించడానికి గాను జీవీఎంసీ సిబ్బంది ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం లేదన్నది స్పష్టంగా కనిపిస్తోంది. దోమల సంతతి వృద్ధి చెందే ఖాళీ కొబ్బరి బొండాలు ఎక్కడపడితే అక్కడ కనిపిస్తున్నాయి. వీటిని విడగొట్టకుండా రోడ్ల పక్కన పడేయడంతో దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా జీవీఎంసీ ఒకటో వార్డు వెంకటేశ్వరమెట్ట వద్ద గోస్తనీనది వంతెన పక్కన వ్యాపారులు ఖాళీ కొబ్బరి బొండాలు తెచ్చి పడేస్తున్నారు.

అలాగే బ్యాంకు కాలనీ నుంచి కుమ్మరిపాలెం వెళ్లే రహదారి పక్కన పలుచోట్ల ఈ ఖాళీ కొబ్బరి బొండాలు దర్శనమిస్తున్నాయి. వీటిని విడగొట్టడం ద్వారా దోమల బెడద కొంత నివారించవచ్చు. అలాగే ఎక్కడ పడితే అక్కడ ఖాళీ కొబ్బరి బొండాలు, టైర్లు ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దోమల బెడద వదిలించుకోవచ్చు.

క్లుప్తంగా

వైభవంగా వారాంతపు పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజలు వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా శ్రీ రాధాదామోదరులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. హరేరామ హరేకృష్ణ కీర్తనలు, అభిషేకాలు, పుష్పాభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ఏర్పాటు చేయండి



చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో బస్ షెల్టర్ కోసం కేటాయించిన సిమెంట్ దిమ్మ

తగరపువలస: విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే ప్రయాణికుల కోసం చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. గతంలో జాతీయ రహదారుల విస్తరణ జరిగినప్పుడు సర్వీస్ రోడ్డును ఆనుకుని డ్రైనేజీపై బస్‌షెల్టర్ కోసం సిమెంట్ దిమ్మ కూడా ఏర్పాటు చేశారు. రహదారుల విస్తరణకు ముందు ప్రయాణికులు ఈ కూడలి వద్దే బస్సులు ఎక్కడం, దిగడం చేసేవారు. రహదారుల విస్తరణ జరిగిన సమయంలో ఈ కూడలిలో ఫ్లై ఓవర్ రావడంతో ప్రస్తుతం బస్సుల కోసం కిలోమీటర్ దూరంలో ఉన్న సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయం, లేదా వెంకటేశ్వరమెట్ట వద్దకు లగేజీలతో అపసోపాలు పడుతూ చేరుకుంటున్నారు. ఇప్పటికైనా తమకు అనువుగా ఉండే ప్రదేశంలో బస్ షెల్టర్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

శ్రీవిద్యా గణపతి ఆలయ వార్షికోత్సవం నేడు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు వలందపేటలోని శ్రీవిద్యా గణపతి, అయ్యప్పస్వామి సహిత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ 10వ వార్షికోత్సవం సోమవారం జరగనుంది. ఈ సందర్భంగా అష్టోత్తర పూర్ణ కలశాలు, ఉత్సవమూర్తులను మహిళలతో నగర ప్రదక్షిణ నిర్వహించనున్నారు. అనంతరం పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి మహా నారాయణసేవ జరగనుందని నెహ్రూ యువజన సేవా సంఘం, ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

ఘనంగా ఫుట్‌బాల్ క్లబ్ వార్షికోత్సవం

ఏయూ క్యాంపస్: నగరానికి చెందిన బ్లూస్టార్స్ స్పోర్ట్స్, కల్చరల్ క్లబ్ 12వ వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏయూ క్రీడా విభాగ సంచాలకుడు ఆచార్య ఎస్.విజయ్‌మోహన్ మాట్లాడుతూ క్రీడల్లో యువతను భాగస్వాములను చేస్తూ బ్లూస్టార్స్ ఫుట్‌బాల్ క్లబ్ దశాబ్ద కాలంగా వందలాది మంది క్రీడాకారులను తీర్చిదిద్దిందని కొనియాడారు. క్లబ్ నిర్వాహకుడు, కోచ్ నరేష్ మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా 700 మంది వరకు యువతను ఫుట్‌బాల్ క్రీడాకారులుగా తీర్చిదిద్దామన్నారు. వీరిలో పది మంది వరకు జాతీయ స్థాయిలో రాణించారన్నారు. భవిష్యత్తులో మరింత మందిని అత్యుత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ విద్యతో సమానంగా యువత క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్లబ్ గౌరవ అధ్యక్షుడు ఇసుకపల్లి వెంకటేశ్వరరావు సంస్థ కార్యక్రమాలను తెలియజేశారు.

ఆర్టీసీ బస్సులు ఆగక ఇబ్బందులు



జాతీయ రహదారిపై బస్సులు ఆపాల్సిన పరదేశిపాలెం జంక్షన్

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు పరిధిలోని పరదేశిపాలెం వద్ద ఆర్‌టీసీ బస్సులు ఆపక ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాత పరదేశిపాలెం, మధురవాడ జోన్‌లోని కొత్త పరదేశిపాలెం, పరదేశిపాలెం ఈడబ్ల్యుఎస్ కాలనీ తదితర కాలనీలు, గ్రామాలు ఇక్కడ ఉన్నాయి. అనాథ, వికలాంగులకు సేవలందించే ప్రముఖ క్రిస్టియన్ యూసీఐఎం సంస్థ వంటివి ఉన్నాయి. ఆయా గ్రామాలు, కాలనీలకు చెందిన వందలాది మంది ప్రజలతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు, దినసరి కూలీలు నిత్యం ఉపాధి, ఇతర అవసరాల కోసం నిత్యం రాకపోకలు సాగించాల్సి ఉంటుంది.

యూసీఐఎం సంస్థలో అంధులు, అంగవైకల్యం ఉన్న వారు, అనాథలకు నిత్యం భోజనం, ఇతర సేవలు అందిస్తున్నారు. వారికి కూడా ఇదే ప్రధాన మార్గం. దీంతో వీరు ఇటు బోయిపాలెం అటు మారికవలసలో బస్సులు దిగి అదనంగా ఆటోలు, ఇతర ప్రయాణ సాధనాల కోసం అదనపు ఖర్చు భరించాల్సి వస్తోంది. ఈ విషయం ఇటీవల ఇక్కడికి వచ్చిన భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి కూడా స్థానికులు తీసుకువెళ్లారు. అధికారులు తక్షణం స్పందించి చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ఉత్కంఠభరితంగా ఎడ్లబళ్ల పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న ముత్తంశెట్టి మహేష్



పోటీలో దౌడు తీస్తున్న ఎద్దులు

ఆనందపురం : మండలంలోని గండిగుండంలో భూలోకమ్మవారి ఉత్సవం సందర్భంగా సర్పంచ్ గంధ్రెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్లబళ్ల పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సమీప జిల్లాల నుంచి 45 ఎడ్లబళ్లు పోటీలో పాల్గొన్నాయి. వివిధ గ్రామాల ప్రజలు తండోప తండాలుగా తరలి వచ్చి ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన 7 ఎడ్ల బళ్లను ఎంపిక చేసి బహుమతులు ప్రకటించారు. స్థానిక సర్పంచ్ గంధ్రెడ్డి శ్రీనివాసరావు తన సొంత నిధులతో 1 నుంచి 7 స్థానాలు సాధించిన సిద్ధి వినాయక (వల్లంపూడి), ముమ్మిన రామకృష్ణ (నర్సయ్యపేట), మరిడిమాంబ (కూండ్రం), మోదమాంబ(నర్సాపురం), గండి కాసులునాయుడు (కేసీబీ పట్నం), మజ్జి రాజేష్(చుక్కపల్లి), అద్దెపల్లి పాలవెల్లి (చుక్కపల్లి)కు వరుసగా రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బంక సత్యం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దక్షిణ భారత హిందీ పరీక్షలు



భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ-చెన్నై ఆధ్వర్యంలో రెండు రోజులుగా భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్ కేంద్రంగా జరిగిన పరీక్షలు ఆదివారం ముగిశాయి. శని, ఆది వారాల్లో 41 మంది హయ్యర్ పరీక్షలు రాయగా ఆదివారం ఒక్కరోజు 84 మంది విద్యార్థులు లోయర్ పరీక్షలకు హాజరయ్యారు. రాష్ట్రభాష పరీక్షకు ఇద్దరు విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోగా వీరిద్దరూ హాజరుకాలేదు. స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు తిరుమల శ్రీదేవి ఆధ్వర్యంలో ఇన్విజిలేటర్లుగా సత్తిరాజులు, ఎ.కృష్ణారావు, ఎం.రమాదేవి, లీలారాణి తదితరులు పాల్గొన్నారు. తదుపరి పరీక్షలు ఈ ఏడాది సెప్టెంబర్/ అక్టోబర్ నెలలో జరుగుతాయని ఆదర్శ హిందీ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కేఎస్ఆర్. కృష్ణారావు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన ఆటో

ఆనందపురం: ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాలలో ఆరుగురు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. మారికవలసకు చెందిన పలువురు అనకాపల్లి జిల్లా దేవరాపల్లి గ్రామంలో జరిగిన వివాహానికి హాజరయ్యారు. తిరిగి ఆదివారం ఉదయం ఆటోలో బయలుదేరి మారికవలస వస్తున్నారు. ఆ ఆటో పెందుర్తి-ఆనందపురం జాతీయ రహదారిపై శొంఠ్యాం పంచాయతీ గొంతినవానిపాలెం వద్ద గల సర్వీసు రోడ్డు వద్దకు చేరుకునే సరికి అదుపుతప్పి డివైడర్ గ్రిల్స్‌ను ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న హారిక(14), వెంకటలక్ష్మి(27), లావణ్య(20), కుమారి(27) గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. మండలంలోని శొంఠ్యాం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. గోపాలపట్నానికి ఆల్తి సన్యాసిరావు(29), లావణ్య(28)లు ద్విచక్ర వాహనంపై బయలుదేరి పద్మనాభం మండలం పాండ్రింకి వెళ్తున్నారు. వారు శొంఠ్యాం వద్దకు చేరుకునే సరికి వెనుక నుంచి వస్తున్న ఆటో ఢీకొట్టడంతో సన్యాసిరావు, లావణ్య గాయపడగా చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. కేసులను స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కమ్మేసిన పొగ మంచు



ఆనందపురం మార్కెట్ వద్ద ఉదయం 8 గంటలు వరకూ కురుస్తున్న పొగమంచు



పెద్దిపాలెం వద్ద ప్రమాదానికి గురైన వాహనాలు

ఆనందపురం: మండలంలోని వివిధ గ్రామాలలో ఆదివారం పొగ మంచు విపరీతంగా కమ్మేసింది. ఉదయం 8 గంటల వరకూ పొగమంచు కురుస్తూనే ఉంది. దీంతో వాహన చోదకులు రోడ్లపై ప్రయాణం చేయడానికి ఇబ్బంది పడ్డారు. దట్టమైన పొగ మంచు కురవడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు అత్యంత సమీపానికి వచ్చే వరకూ కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో పెద్దిపాలెం వద్ద ఆరులేన్ల రహదారిపై పలు వాహనాలు ఢీకొని ప్రమాదానికి గురయ్యాయి.

పొగ మంచు వల్ల కొన్ని వాహనాలను రోడ్డుపైనే నిలిపి వేశారు. దీంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ ఎస్ఐ రఘురామ్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని అడ్డంగా ఉన్న వాహనాలను పక్కకు తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఎవరికీ ప్రమాదం సంభవించలేదని ఎస్ఐ తెలిపారు.

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

భీమునిపట్నం: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆర్ఎస్ఎస్ కార్యకర్త అమరప్రసాద్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా దళిత సంఘాల నాయకులు ఆందోళన చేశారు. స్థానిక కీతిన్‌పేట అంబేడ్కర్ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అంబేడ్కర్ రచించిన కొన్ని రచనల సమయంలో తాను ఉండి ఉంటే గాంధీజీని గాడ్సే కాల్చినట్టు తాను కూడా ఆయన్ను కాల్చి చంపేవాడినని అమరప్రసాద్ మాట్లాడడం చాలా దారుణమన్నారు. దేశానికి అత్యుత్తమ సేవలు అందించిన మహనీయుడిని ఇలా హేయంగా దూషించిన ప్రసాద్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ ద్రోహి కేసు పెట్టి శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కుల వివక్షత పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు భాగం లక్ష్మి, ఉత్తరాంధ్ర దళిత సంఘ నాయకుడు భాగం గోపాలరావు, దళిత నాయకులు బోని కుమార్, బోని నర్సింగరావు, పారుపల్లి నర్సింగరావు, పట్టా ఈశ్వరరావు, కింతాడ అప్పలరాజు, సాయి, గంధవరపు కృష్ణ పాల్గొన్నారు.

రోడ్లపై పశువులను విడిచిపెడితే చర్యలు



రోడ్డుపై సంచరిస్తున్న ఆవును తరలిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

పీఎం పాలెం: పశువులను బాధ్యతారహితంగా రోడ్లపై విడిచిపెడితే వాటి యజమానులపై చర్యలు తీసుకుంటామని మధురవాడ జోన్-2 జెడ్సీ కనక మహాలక్ష్మి పేర్కొన్నారు. ఆవులు, గేదెలను సంరక్షించేవారు వాటిని సొంత స్థలాలకు పరిమితం చేయాలన్నారు. రోడ్ల మీద సంచరించే పశువులను స్వాధీనం చేసుకుని వాటిని ఆరిలోవలోని బందెల దొడ్లకు తరలిస్తామన్నారు. అంతే కాకుండా స్వాధీనం చేసుకున్న పశువులు ఒక్కొక్కదానికి రూ. 3 వేలు జరిమానా విధిస్తామని జెడ్సీ హెచ్చరించారు.

మత్స్యకారుల అభివృద్ధికి సహకారం అవసరం



జ్యోతి వెలిగిస్తున్న అఖిల భారత సీమా సురక్ష సహ ప్రముఖ్ జి.మురళీధర్, మత్స్యకార నాయకులు

ఆరిలోవ: మత్స్యకారుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందించాలని అఖిల భారత సీమా సురక్ష సహ ప్రముఖ్ జి.మురళీధర్ కోరారు. జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లోని బీవీకే పాఠశాల ఆవరణలో ఆదివారం మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమితి విధి విధానాలపై చర్చించారు. మత్స్యకారుల అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టాలి, ప్రభుత్వాల నుంచి ఎలాంటి సహకారం కోరాలి.. తదితర అంశాల గురించి మాట్లాడారు. అనంతరం మురళీధర్ మాట్లాడుతూ ప్రకృతి సంపదైన తీర ప్రాంతాలను అందరూ కలసికట్టుగా కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల నాయకులకు పూర్తిస్థాయిలో మత్స్యకారుల విధి విధానాలు, సమస్యలపై అవగాహన ఉండాలన్నారు. విద్యా భారతి అఖిల భారత అధ్యక్షుడు దూసి రామకృష్ణ, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, రాష్ట్ర మత్స్యకార సంఘం అధ్యక్షుడు కె.పోలయ్య మాట్లాడుతూ రాష్ట్ర మత్స్యకార సంక్షేమం కోసం 2004లో ఈ సమితి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అప్పటి నుంచి మత్స్యకారుల అభ్యున్నతికి కృషి చేస్తున్నామన్నారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.10 వేలు భృతిని రూ.25 వేలకు పెంచాలని, వేట సమయంలో మృతి చెందిన వారికి రూ.25 లక్షలు బీమా పరిహారం చెల్లించాలన్నారు. ఇంటిగ్రేటెడ్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఐఎఫ్‌డీఏ) ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరిమళ్ల వాసు, ఎంపాడ రాష్ట్ర కోఆర్డినేటర్ హనుమంతరావు, అన్ని జిల్లాల సంఘాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

ఉప్పు రైతు బేజారు!

- సాగుపై దెబ్బతీసిన ముందస్తు వర్షాలు
- పూర్తి స్థాయిలో సిద్ధం కాని గల్లీలు



కొల్లిదిబ్బ వైపు సాగుకు సిద్ధం చేసిన మడులు



గల్లీలలో దిగుబడికి వచ్చిన ఉప్పు

తగరపువలస: భీమిలి మండలం కొత్త మూలకుద్దు పంచాయతీలో ఉప్పు సాగును ముందస్తు వర్షాలు దెబ్బతీశాయి. గతేడాది నవంబరు, ఈ ఏడాది సంక్రాంతికి ముందు కురిసిన వర్షాల కారణంగా సాగుకు మూడు మాసాల ఆలస్యమైంది. ఇప్పటికీ పూర్తి స్థాయిలో గల్లీలు సిద్ధంగా లేదు. గల్లీల్లో పని శ్రమతో కూడుకున్నది కావడంతో కూలీల కొరత కూడా వేధిస్తోంది. పంచాయతీలో 99 ఎకరాల విస్తీర్ణంలో గల్లీలు ఉండగా.. ప్రస్తుతం 20 ఎకరాలకు మించి సాగులోకి రాలేదు. ప్రస్తుతం తొలి విడత దిగుబడి వచ్చినా ఎండలు అంత తీవ్రంగా లేకపోవడంతో ఎకరానికి 5 బస్తాలు మించి రావడం లేదని లీజుదారులు వాపోతున్నారు. లీజుదారుల నుంచి వీటి యజమానులు కౌలు సొమ్ము వసూలు చేయకపోయినా కేంద్ర ప్రభుత్వంతో నియామకమైన సాల్ట్ అధికారులు మాత్రం ఎకరాకు రూ.5 వేలు ముందే వసూలు చేస్తున్నారు.

బోసిపోయిన గల్లీలు

ప్రతి ఏటా వర్షాకాలం ముగిసిన తరువాత 300 మంది వరకు ఇక్కడ గల్లీల్లో ఉపాధి పొందేవారు. దీపావళి తరువాత నుంచి సంక్రాంతి వరకు రెండు మాసాల పాటు సముద్రం ఒడ్డున ఉప్పుటేరు నుంచి నీటిని కాలువల ద్వారా గల్లీలకు మళ్లించడానికి తుప్పలు తొలగించడం, మట్టితో కాలువలు, తూములు సరిచేసుకోవడం చేస్తుండేవారు. సంక్రాంతి తరువాత నుంచి ప్రారంభమయ్యే సాగు తిరిగి జూలై వరకు సాగుతుంది. ఈ సీజన్‌లో రెండు సార్లు అకాల వర్షాల కారణంగా గల్లీలు దెబ్బతినడంతో చాలావరకు ప్రత్యామ్నాయ పనుల వైపు మళ్లిపోయారు. దీంతో గల్లీలన్నీ తుప్పలతో నిండిపోయాయి. ఈ సీజన్‌లో తొలి దిగుబడి ఎకరాలకు 5 బస్తాల వరకు వచ్చింది. ప్రస్తుతం ఉప్పుకు ఉన్న డిమాండ్ కారణంగా 50 కిలోల బస్తా రూ.500 వరకు ఉంది. ఎండలు ముదిరితే రెండు వారాలకోసారి దిగుబడి ఎకరాకు 35 బస్తాల వరకు వచ్చి బస్తా రూ.130కే లభిస్తుంది. ఇక్కడ పురుషులకు రూ.700, మహిళలకు రూ.500 వంతున కూలీ లభిస్తుంది.

ఇప్పటికే కుప్పలు పేరుకుపోయేవి



ఈ సీజన్‌లో అకాల వర్షాల కారణంగా ఇప్పటికే మూడు నెలల సాగుకు ఆలస్యమైంది. లేదంటే ఈ పాటికి ఉప్పు కుప్పలు పేరుకుపోయేవి. ఒడిశా, విజయనగరం, శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు ఉప్పు కోసం అడుగుతున్నారు.

– బవిరిశెట్టి పోలయ్య, కౌలుదారుడు

అదృష్టం పరీక్షించుకుంటున్నాం



ఎండలు ఆరుమాసాల పాటు సహకరిస్తే పెట్టుబడులు పోను ఆదాయం మిగులుతుంది. కూలి ఖర్చులు పెరిగినందున మా కుటుంబ సభ్యుల సాయం ఎక్కువగా ఉంటుంది. గల్లీలను ఆనుకుని ఉండడం వల్ల ఇంటి పక్కనే ఉపాధి లభించినట్టుంది. అన్ సీజన్‌లో భవన నిర్మాణ పనులకు వెళ్తాం.

– బవిరిశెట్టి రాము, కౌలుదారుడు

ఘనంగా శ్రీనృసింహ హోమం

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం శ్రీ నృసింహ హోమం ఘనంగా జరిగింది. లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతీ స్వాతి నక్షత్రం రోజున సింహగిరిపై నృసింహ హోమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా ఆదివారం స్వాతి నక్షత్రం కావడంతో ఉదయం 7 నుంచి ఆలయ కల్యాణ మండపంలో హోమం నిర్వహించారు. తొలుత చక్రపెరుమాళ్లను వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకొచ్చి అక్కడి హోమగుండం వద్ద అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కలశారాధన, అగ్నికార్యం చేశారు.

గంజాయి కేసులో మరో నలుగురి అరెస్ట్

బీచ్ రోడ్డు: బీచ్ రోడ్డులో అక్రమంగా గంజాయి విక్రయాలు చేపట్టిన వారికి గంజాయి సప్లయ్ చేస్తున్న నలుగురిని మూడో పట్టణ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి బీచ్‌రోడ్డులో అక్రమంగా గంజాయి విక్రయాలు చేస్తున్న ముగ్గురు ఏయూ సెక్యూరిటీ గార్డులను పోలీసులు అరెస్ట్ చేసి విచారించారు. తమకు ఆనందపురానికి చెందిన సాయి, గోవింద్, తూర్పు గోదావరికి చెందిన సంతోష్, శ్రీకాకుళానికి చెందిన సతీష్ గంజాయిని సప్లయ్ చేసినట్లు సెక్యూరిటీ గార్డులు తెలిపారు. దీంతో రంగంలోకి దిగిన మూడో పట్టణ పోలీసులు ఆ నలుగురిని కూడా అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

హాస్టల్ భవనం.. చదువుల నిలయం



హాస్టల్ భవనంపై చదువుకుంటున్న విద్యార్థినులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం హాస్టల్ భవనాలపై విద్యార్థులు చదువుకోవడానికి వీలుగా అధికారులు ప్రత్యేక వసతులు కల్పిస్తున్నారు. ఇటీవల కాలంలో కొత్తగా నిర్మించిన ప్రతి హాస్టల్ భవనంపైన ప్రత్యేకంగా సిమెంట్ బెంచీలు, టేబుళ్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళల్లో విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో హాయిగా చదువుకోవడానికి ఇవి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్నాయి. పై అంతస్తులో ప్రత్యేకంగా టాయిలెట్స్ కూడా నిర్మించి అందుబాటులో తీసుకొచ్చారు. గ్రంథాలయానికి ప్రత్యామ్నాయంగా ఈ సౌకర్యాలు నిలుస్తున్నాయి. హాస్టళ్లలో ఉండే విద్యార్థులు టెర్రస్‌పై సాయంత్రం వేళల్లో చదువుకుంటూ తమ సమయాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నారు. వర్సిటీలో నిర్మించే ప్రతి హాస్టల్‌లో ఇటువంటి సదుపాయాలు కల్పించాలని ఇంజినీరింగ్ అధికారులకు వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ప్రతి హాస్టల్ భవనంపై విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేక వసతులు కల్పిస్తుండడంపై అందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.